ఇళ్ల స్థలాల కోసం ర్యాలీ

- సిపిఎం ఆధ్వర్యాన మానుకోటలో మహాధర్నా
- ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం
- గుడిసెవాసులపై అక్రమ కేసులు ఎత్తేయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇండ్ల స్థలాలకు పట్టాల కోసం పేదలు కదం తొక్కారు. సిపిఎం అండగా మహబూబాబాద్ జిల్లా మానుకోటలో భారీ ర్యాలీ తీశారు. అనంతరం మహాధర్నా చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం వెనక పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చేవరకు సిపిఎం పోరాడుతుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుంకరి వీరయ్య స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కుమ్మక్కైన అధికారులు ఆ భూములను కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని, తక్షణమే పేదలకు పంచి పట్టాలు ఇవ్వాలని, గుడిసె వాసులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని సర్వేనెంబర్ 255/1, 287, 551లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఎం కార్యాలయం నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టి తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పార్టీ పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం అధ్యక్షత నిర్వహించిన ధర్నాలో జి నాగయ్య, ఎస్ వీరయ్య మాట్లాడారు.

రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలోకి రాకముందు మానుకోటంలో 5000 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, అందులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 400, 500 ఎకరాల్లో పేదలకు భూములు పంచి ఇచ్చారన్నారు. మిగిలిన భూములను ఈ పదేళ్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూమాఫియాదారులు అధికారులతో కుమ్మక్కై ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ పేదలకు ఇళ్లు, స్థలాలకు పట్టాలిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కుర్చీలు సర్దుకోకముందే బిఆర్ఎస్ నాయకులు మహబూబాబాద్ పట్టణంలో అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ భవనాన్ని ఆక్రమించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యమైన కొద్దీ మానుకోటలో ప్రభుత్వ భూములు మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ కబ్జాలోకి పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కలెక్టరేట్ కార్యాలయం వెనుక సర్వేనెంబర్ 287/1లో ఏడాది నుంచి 3000 మంది పేదలు గుడిసెలు వేసుకుని అక్కడే నివాసం ఉంటున్నారని చెప్పారు. అధికార యంత్రాంగం మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌తో కుమ్మక్కై, పేదలపై 18సార్లు దాడులు చేశారని చెప్పారు. పదిమంది మహిళలపై క్రిమినల్ కేసులు, 150మందిపై బైండోవర్ కేసులు పెట్టి వేధించారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మానుకోటలో కలెక్టరేట్, మెడికల్ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజీల చుట్టూ ఉన్న భూమి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. గతంలో తహసీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆధ్వర్యంలో పేదలు పట్టాల కోసం ధర్నా నిర్వహించారని, శంకర్‌నాయక్ వచ్చి పేదలకు భూములు పంచుతానని, పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చి మోసగించాడని అన్నారు.

పేదలకు భూములు దక్కాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని తమ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించి అప్పటి మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ శశాంకతో మాట్లాడారని చెప్పారు. తక్షణమే ఆ భూముల సర్వే నిర్వహించి పేదలకు పట్టాలు, ఇళ్లు ఇవ్వాలని, సంక్రాంతి పండుగ తర్వాత పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టాలని ఆదేశించినట్టు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రస్తుత కలెక్టర్ ఆ భూమిలో సర్వే చేసి పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు.

భూ పోరాటంలో పేదలపై పోలీసులు పెట్టిన కేసులన్నింటినీ ఎత్తేస్తామని సిఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, వెంటనే ఆ దిశగా పోలీసు యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టరేట్ వెనుక పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాన్ని అటవీ శాఖకు కేటాయించినట్టు కలెక్టర్ చెబుతున్నారని, ఆ భూమి ప్రభుత్వ భూమి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుర్ణపు సోమయ్య, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, సమ్మెట రాజమౌళి, కుర్ర మహేష్, దుడ్డుల రామ్మూర్తి, కుంట ఉపేందర్, నక్క సైదులు, చీపిరి యాకయ్య, రావుల రాజు, చాగంటి భాగ్యమ్మ, కుమ్మరి కుంట నాగన్న, తోట శ్రీనివాసు, ఎర్ర శ్రీనివాస్, బానోతు వెంకన్న, బూర్గుల లక్ష్మణ, యమగాని వెంకన్న, శ్రీరాం నాయక్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎక్స్‌గ్రేషియా అందించాలి

- సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్-2020లో వచ్చిన వరదల్లో చిక్కుకుని మృతిచెందిన 19మందికి సంబంధించి తక్షణమే ఆ కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈమెయిల్ ద్వారా వినతిపత్రాన్ని పంపించారు. 2020 అక్టోబర్ నెలలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీ వర్షాలు, వరదలకు పలువురు మృతిచెందారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.5లక్షలు చెలిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు ఎక్స్‌గ్రేషియా అందించలేదన్నారు. బాధిత కుటుంబాలు రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం, సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పనిచేస్తూ గగన్‌పహాడ్ వద్ద వరదల్లో కొట్టుకునిపోయి మృతిచెందిన నల్లమోతు మాధవరావు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని అనేక సార్లు తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. ఐదు లక్షలున్న ఎక్స్‌గ్రేషియాను రూ. నాలుగు లక్షలు తగ్గించిన ప్రభత్వం.. బాధితులకు ఇప్పటి వరకు సహాయం చేయలేదని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా బాధితులకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా అందించాలని ఎం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.



అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టుకివ్వొద్దు

- 55 జిఒను వెంటనే రద్దు చేయాలి
- యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట విద్యార్థుల ఆందోళన
- వరంగల్‌లోనూ నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దని, 55 జిఒను వెంటనే రద్దు చేయాలంటూ యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. గురువారం వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నూతన హైకోర్టు భవన నిర్మాణానికి కేటాయిస్తూ 55 జిఒ విడుదల చేశారు. ఈ జిఒను వెంటనే రద్దు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు నాలుగు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. గురువారం పరిపాలన భవనం ఎదుట వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ప్రభుత్వం కేటాయించడం దారుణమన్నారు. ఈ యూనివర్సిటీలో 300కు పైగా పక్షి జాతులు, 90కి పైగా వివిధ రకాల ఔషధ మొక్కలు ఉన్నాయని, ఇప్పుడు ఈ స్థలం హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తే వాటి ఉనికికే ప్రమాదం అన్నారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే ఈ యూనివర్సిటీ భవిష్యత్‌లో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే 55 జిఒను వెనక్కి తీసుకొని, హైకోర్టుకి మరో చోట భూమి కేటాయించాని డిమాండ్ చేశారు. జిఒను రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల నిరసనకు యూనివర్సిటీ ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

వరంగల్‌లోనూ ఆందోళన

హైదరాబాద్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాయలయానికి చెందిన వంద ఎకరాలను రాష్ట్ర హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించడాన్ని వ్యవసాయ కళాశాల విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జిఒ 55ను రద్దు చేయాలని వరంగల్ ఆరేపల్లిలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిరసన ప్రదర్శన చేశారు. వ్యవసాయ పరిశోధనలకు విఘాతం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

17న డిసెట్ ధ్రువపత్రాల పరిశీలన

- 18 నుంచి 22 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు
- 25న సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డిఇఐఇడి), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డిపిఎస్ఇ) కోర్సుల్లో 2023-25 బ్యాచ్ ప్రవేశాల కోసం నిర్వహించిన డిసెట్-2023 కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ఈ నెల 17న ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఈ మేరకు డిసెట్ కన్వీనర్ ఎస్ శ్రీనివాసాచారి గురువారం రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. మొదటి విడతలో హాజరు కాని అభ్యర్థులు ఈ నెల 17న ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. ఈ నెల 18 నుంచి 22 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని వివరించారు. 25న సీట్లు రెండో విడత కేటాయిస్తామని పేర్కొన్నారు. 26 నుంచి 29 వరకు ఫీజు చెల్లించి కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఈనెల 31న రెండోవిడత సీట్ల కేటాయింపు తర్వాత స్లైడింగ్ (సీట్లు మార్చుకోవడానికి) అవకాశముందనీ, అదేరోజు మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వచ్చేనెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఫీజు చెల్లించి కేటాయించిన కాలేజీల్లో చేరాలని సూచించారు.

లాక్కున్న పోడు భూములను తిరిగివ్వాలి

- సిపిఎం కార్యాలయంపై దాడి చేసిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి
- రైతులపై పెట్టిన కేసులను ఎత్తేయాలి
- సిపిఎం జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి ఎర్రా శ్రీకాంత్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా మాణిక్యారం ఎర్రబోడు రైతుల నుంచి బలవంతంగా లాక్కున్న పోడు భూములను తిరిగి వారికి ఇవ్వాలని సిపిఎం జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి ఎర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సిపిఎం కార్యాలయంపై దాడి చేసిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఖమ్మం సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రంతో కలిసి శ్రీకాంత్ మాట్లాడారు. కారేపల్లి మండలం మాణిక్యారం, ఎర్రబోడు గ్రామాల గిరిజన పేద రైతులు ఏడు దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. కానీ, 2020లో హరితహారం పేరుతో అటవీశాఖ అధికారులు దాదాపు 200 ఎకరాలను బలవంతంగా తీసుకున్నారన్నారు. ప్రత్యామ్నాయం గా మరోచోట భూములు చూపుతామని మభ్యపెట్టి.. తిరిగి గిరిజన పోడు రైతులపైనే అక్రమ కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలోనే స్థానిక మండల అధికారులు, తహసీల్దార్, ఎంపిడిఒ, పోలీస్ అధికారులు అటవీశాఖ అధికారులతో మూడు దఫాలుగా చర్చలు జరిపారన్నారు. ఆ భూములు గతం నుంచి పోడు రైతుల సాగులోనే ఉన్నాయని కలెక్టర్‌కు రిపోర్టు పంపించారని గుర్తు చేశారు. "మా భూములు మాకే ఇవ్వాలని.. భూమిపై హక్కులు కల్పించాలని" అనేకసార్లు ఆందోళనలు, పోరాటాలు చేశారని చెప్పారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎఫ్ఆర్‌సి గ్రామసభలో పోడు రైతుల దరఖాస్తుల స్వీకరించి ఆమోదించిందని తెలిపారు. భూములను సాగు చేసుకుంటే.. అటవీ శాఖ అధికారులు అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించే ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు. సిపిఎం బృందం కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారిని కలిసి కేసులు లేకుండా చూడాలని కోరామని, అరెస్టులు అవసరం లేదని అధికారి చెప్పినా ఎఫ్ఆర్ఓ అతి ఉత్సాహం ప్రదర్శించారన్నారు. నాయకులను ఫారెస్ట్ కార్యాలయంలో ఉంచి.. తన సిబ్బందితో వెళ్లి సిపిఎం కారేపల్లి కార్యాలయంపై దాడి చేయడం సరికాదన్నారు. అలాంటి అధికారిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి మాణిక్యారం, ఎర్రబోడు భూ సమస్యను పరిష్కరించి పోడు రైతులకు న్యాయం చేయాలని కోరారు. మళ్లీ పోడు రైతుల జోలికి వస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మాచర్ల భారతి, బండి రమేష్, చింతలచెరువు కోటేశ్వరరావు, వై.విక్రమ్ తదితరులు ఉన్నారు.

టెన్త్ స్పాట్ రెమ్యూనరేషన్ చెల్లించాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతేడాది పదో తరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని తపస్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావునుహైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఏ జిల్లా లోనూ మూల్యాంకనం రెమ్యూనరేషన్ చెల్లించకపోవడం దారుణమని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామనీ, త్వరలోనే రెమ్యూనరేషన్ ను విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చారని ఈ నెల 22న అయోధ్యలోని రామాలయంలో ప్రాణప్రతిష్ట జరుగుతున్న సందర్భంగా రాష్ట్రంలో సెలవు ప్రకటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వారు వినతిపత్రం అందజేశారు.

టిఎస్ఆర్‌టిసి డిపోలో నేడు పందెం కోడి వేలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బస్సులో ఓ ప్రయాణికుడు తన పందెం కోడిని వదిలి వెళ్లిపోయాడు. దాన్ని ఏం చేయాలో తోచక రెండు రోజులుగా చూసిన ఆర్‌టిసి సిబ్బంది కోడిని వేలం వేయనున్నారు. ఈ విచిత్ర సంఘటన కరీంనగర్ జిల్లా కేంద్రం లో గురువారం జరిగింది. కరీంనగర్-2 డిపో పరిధిలోని బస్సులో మూడు రోజుల కిందట ఓ వ్యక్తి వెంట తీసుకొచ్చిన పందెం కోడిని మరిచిపోయాడు. దాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో ఆర్‌టిసి కరీంనగర్ -2 డిపో మేనేజర్ ఈ నెల 12న శుక్రవారం కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో బహిరంగ వేలం వేస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని ఇచ్చిన ప్రకట న నోటీసు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలివ్వండి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి టిఎస్‌జిహెచ్‌ఎంఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న 22,500 మంది ఉద్యోగులకు నవంబర్, డిసెంబర్ రెండు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టిఎస్‌జిహెచ్‌ఎంఎ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశానికి మెయిల్ ద్వారా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి, కోశాధికారి బి.తుకారానికి వినతిపత్రం అందజేశారు. సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులకు నవంబర్, డిసెంబర్ రెండు నెలల వేతనాలు ఇంతవరకు అందకపోవడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సంక్రాంతి పండుగ సమయంలో జీతాలు అందకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబ పోషణ, పిల్లల ఫీజులు, వృద్ధ తల్లిదండ్రుల ఆరోగ్య సమస్యలకు కావాల్సిన చికిత్సలకూ డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీన్ని తీవ్రమైన సమస్యగా పరిగణించి సంక్రాంతి పండుగ లోపల జీతాలివ్వాలని కోరారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్

- 18న నామినేషన్లు, 29న పోలింగ్, ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యే కోటా కింద రెండు ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. శుక్రవారం నుంచి ఈ నెల 18 వరకు నామినేషన్లు దాఖలకు గడువుంది. 19న నామినేషన్ల పరిశీలన, 22న ఉపసంహరణ ఉంటుంది. ఈనెల 29న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. వారిద్దరి పదవీ కాలం 2027 నవంబర్ 30వ వరకు ఉంది. ప్రస్తుతం శాసనసభ్యుల బలాబలాలను బట్టి చూస్తే కాంగ్రెస్‌కు మెజార్టీ ఉంది. రెండు స్థానాలకు విడివిడిగా ఎన్నికలు జరుగుతుండటంతో అవి కాంగ్రెస్‌కే దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఎమ్మెల్సీ అభ్యర్థులపై కాంగ్రెస్ కసరత్తు

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంతో అభ్యర్థులపై కాంగ్రెస్ కసరత్తు ప్రారంభించింది. ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటా, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఆ పార్టీ ఫోకస్ పెట్టింది. సిఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లేటప్పటికి కొన్ని నామినేటెడ్ పదవులకు నేతలను ఎంపిక చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఎమ్మెల్సీ అభ్యర్థుల కోసం పార్టీలో పోటీ తీవ్రంగా నెలకొంది. మొత్తంగా ఆరుగురు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులకు ప్రకటించాల్సి ఉన్నది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులకు మంత్రి పదవులు దక్కుతాయన్న ప్రచారంతో ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. పార్టీ సీనియర్ నేతలు జి చిన్నారెడ్డి, షబ్బీర్ అలీ, జగ్గారెడ్డి, అద్దంకిదయాకర్, బెల్లయ్యనాయక్, సంపత్‌కుమార్, పటేల్ రమేష్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీగౌడ్, ఫిరోజ్‌ఖాన్, నరేందర్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా జరగనున్న ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించనున్నట్టు తెలిసింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు ఏదో ఒక రంగంలో సేవ చేసే వారికి ఇవ్వాల్సి ఉన్నది. అందులో టీజేఎస్ అధ్యక్షులు కోదండరాం, విద్యావేత్త జాఫర్ జావిద్, మస్కతి, అజరుద్దీన్ తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.



వికలాంగుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

- ఎన్‌పిఆర్‌డి క్యాలెండర్ ఆవిష్కరణలో పఠాన్ ఉమర్‌ఖాన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని హెలెన్ కెల్లర్ విద్యాసంస్థల అధినేత పఠాన్ ఉమర్‌ఖాన్ అన్నారు. హైదరాబాద్‌లోని హెలన్‌కెల్లర్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఎన్‌పిఆర్‌డి ముద్రించిన 2024 క్యాలెండర్‌ను ఆయన గురువారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమర్‌ఖాన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం కనీసం ఉన్న చట్టాలనైనా అమలు చేయాలని కోరారు. సమాజంలో వివక్షతకు, చిన్న చూపుకు వారు గురవుతున్నారనీ, అందువల్ల వారిలో మనోధైర్యం కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని తెలిపారు. వికలాంగుల్లో అక్షరాస్యత పెంచేందుకు ప్రత్యేక విద్యాసంస్థలు ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని తెలిపారు. ఎన్‌పిఆర్‌డి ముద్రించిన క్యాలెండర్ విజ్ఞాన దాయకంగా ఉందన్నారు. సమస్యలపై పోరాడుతూనే వికలాంగులను చైతన్యపరిచేందుకు ఆ సంస్థ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం అడివయ్య, కార్యక్రమంలో హెలెన్ కెల్లర్ పిజి కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ అర్ముఘం, హెలెన్ కెల్లర్ రెహబిలిటేషన్ సెంటర్ డైరెక్టర్ ఎం శశిధర్ రెడ్డి, సిబ్బంది గౌస్, ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె నాగలక్ష్మి, నాయకులు అమరావతి, చంద్రశేఖర్, అనిల్‌తో పాటు విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎపిలో పనిచేస్తున్న వారిని తెలంగాణ వెనక్కి తేవాలి

ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి టిఎన్‌జిఒ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకురావాలని టిఎన్‌జిఒ కేంద్ర సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వాటి ప్రతులను ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాల్లోనూ అందజేశారు. ఎపిలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకురావాలంటూ రామకృష్ణారావు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారనీ, త్వరలో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఒ అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకటేశ్వర్లు, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు కె శ్రీకాంత్, కార్యదర్శి పి హరికృష్ణ, ఉపాధ్యక్షులు మహేష్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలు చేసిన వ్యక్తుల పుస్తకాలు రావాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- సమాజం నుంచే ఆలోచనలు : కె శ్రీనివాస్‌రెడ్డి
- మగ్దూం భవన్‌లో అసెంబ్లీలో ఒకే ఒక్కడు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమ్యూనిస్టుల చరిత్రను, త్యాగాలు చేసిన వ్యక్తుల చరిత్ర పట్ల పుస్తకాలు రావాల్సిన అవసరం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నొక్కి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో జర్నలిస్టు హసీనా రచించిన 'అసెంబ్లీలో ఒకే ఒక్కడు' పుస్తకాన్ని ఐజెయు జాతీయ అధ్యక్షులు, ప్రజాపక్షం సంపాదకులు కె శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పుస్తకాలు రాసే క్రమంలో కంటెంట్, అంశాల వారీగా ప్రాధాన్యత పాటించాలని సూచించారు. పుస్తకాన్ని రచించినందుకు షేక్ హసీనాను ఆయన అభినందించారు. కె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టుల అవసరం చాలా ఉందని బిజెపి మినహా అందరూ భావిస్తున్నారన్నారని చెప్పారు. బిజెపి వాళ్లు మాత్రం తమకు ప్రథమ శత్రువు కమ్యూనిస్టులే అని చెబుతున్నారన్నారు. బిజెపి తన సిద్ధాంత భావజాలంతో ముందుకెళ్లడం లేదని ఆ పార్టీ నేతలే మోడీపై విమర్శలు ఎక్కుపెడుతున్నారన్నారు. ఒక పార్టీ నుంచి మరో పార్టీకి ఎవ్వరు వెళ్లినా ప్రజలు పట్టించుకోవడం లేదని, వారిని యాక్సెప్ట్ చేస్తున్నారని తెలిపారు. కమ్యూనిస్టులు మారితేనే ఇబ్బందులు వస్తాయని అందరికీ అనిపిస్తోందన్నారు. ఒక వ్యక్తి గురించి పుస్తకాన్ని రాసే సమయంలో రచయితకు స్వేచ్ఛ ఉంటుందనీ, అదే సమయంలో ఆ వ్యక్తికి సంబంధించి తప్పులు దొర్లితే వాటిని సవరించే హక్కు కూడా ఆ వ్యక్తికి ఉంటుందని వివరించారు. కవి, రచయితలకు, మనిషికి సమాజం నుండే ఆలోచనలు వస్తాయని చెప్పారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల గొంతుకే కమ్యూనిస్టుల గొంతు అని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిడి ఉంటుందనీ, చట్టసభల్లో ప్రాతినిధ్యం తక్కువగా ఉన్నప్పటికీ అందరి సమస్యలపైనా మాట్లాడాల్సిన అవసరం ఉంటుందన్నారు. అందులో కూనంనేని సాంబశివరావు సఫలీకృతం అవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. సిఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ డి కృష్ణకుమారి మాట్లాడుతూ స్వాతంత్ర్యం నుంచి ఇప్పటి వరకు చరిత్ర మరుగునపడిన మహిళల చరిత్రను 'రెడ్ స్వాన్ పబ్లిషర్స్ వేదిక' ద్వారా ప్రతి మూడు నెలలకు ఒక పుస్తకాన్ని తీసుకొస్తామని తెలిపారు. పుస్తక రచయిత హసీనా మాట్లాడుతూ జీవితాలను త్యాగం చేసి, నిత్యం ప్రజల పక్షాన నిలబడుతున్న పార్టీ సిపిఐ అని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేంపావని, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఎఐ సేవలు

- రహదారి భద్రతపై సాంకేతిక సహకారం
- సిఎంతో గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తుందనీ.. వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాల్లో ఎఐ సేవలు వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట గురువారం జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయండనికి సంసిద్ధత వ్యక్తం చేసారు. తెలంగాణ పౌరుల అవసరాలను తీర్చడానికి నాణ్యమైన సాంకేతిక సేవలను అందించే విస్తృత సాంకేతికత, నైపుణ్యం తమవద్ద ఉందని చంద్రశేఖర్ సిఎంకు వివరించారు. గూగుల్ మ్యాప్స్ , గూగుల్ ఎర్త్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి రహదారి భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు డి శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలను బలోపేతం చేయండి

డాక్టర్ డొమినిక్ మావో నేతృత్వంలోని హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యాపకుల బృందం గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో భేటీఅయింది. ఉస్మానియా యూనివర్సిటీలో జనవరి 7వ తేది నుండి నిర్వహిస్తున్న ప్రోగ్రాం ఫర్ సైంటిఫిక్లీ ఇన్‌స్పైర్డ్ లీడర్‌షిప్ (పిఎస్ఐఎల్-24) కార్యక్రమం గురించి సిఎంకు వివరించారు. పేద విద్యార్థుల కోసం రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలను బలోపేతం, సుసంపన్నం చేయడానికి ఏడాదిపాటు విద్యా కార్యక్రమాలను నిర్వహించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యాపకుల బృందాన్ని సిఎం కోరారు.

జనవరి 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉస్మానియా యూనివర్సిటీలో తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సహకారం తో హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యాపకుల బృందం 40 ప్రభుత్వ పాఠశాలల్లోని వంద మంది పది నుంచి 12వ తరగతి విద్యార్థులకు, ఉన్నత పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు సైంటిఫిక్లీ ఇన్‌స్పైర్డ్ లీడర్‌షిప్ (పిఎస్ఐఎల్-24) శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని హార్వర్డ్ అధ్యాపకులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ కార్యక్రమ పూర్తి వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి రవీందర్, విద్యాశాఖ కమిషనర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు.



గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోటతో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

సిఎంతో మైక్రాన్ కంపెనీ సిఇఒ భేటీ

ప్రపంచంలోనే అతి పెద్ద మెమరీ చిప్ తయారీ కంపెనీ మైక్రాన్ టెక్నాలజీ ప్రెసిడెంట్ సిఇవో సంజయ్ మెహ్రోత్రా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. అమెరికా నుంచి ప్రత్యేకంగా సిఎంను కలిసేందుకు వచ్చిన సంజయ్ మెహ్రోత్రా గురువారం సాయంత్రం సిఎం నివాసంలో ఆయనను కలుసుకున్నారు. తెలంగాణలో పెట్టుబడులకు, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం ఉందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మైక్రాన్ కంపెనీ ఆసక్తి చూపితే రాష్ట్ర ప్రభుత్వం తగిన సహాయ సహకారాలను అందిస్తుందని ముఖ్యమంత్రికి భరోసా ఇచ్చారు. పరిశ్రమల స్థాపన, నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి కల్పనతో పాటు రాష్ట్ర ఆర్థికవృద్ధికి పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.



మంచిర్యాల మున్సిపాలిటీ 'హస్త'గతం

- అవిశ్వాస తీర్మానంలో నెగ్గిన కాంగ్రెస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల మున్సిపాలిటీని కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఇటీవల కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందించిన నేపథ్యంలో గురువారం బల నిరూపణ చేపట్టారు. కాంగ్రెస్ వైపు 27 మంది కౌన్సిలర్లు నిలిచారు. మెజారిటీ కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు ఉండటంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో మంచిర్యాల మున్సిపాలిటీని కాంగ్రెస్ దక్కించుకుంది. కాగా బుధవారం చైర్మన్ పెంట రాజయ్య పదవికి రాజీనామా చేశారు. రెండ్రోజుల కిందట వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్ కూడా రాజీనామా చేశారు. నిబంధనల ప్రకారం అవిశ్వాసానికి మూడ్రోజుల ముందు రాజీనామా చేస్తేనే బలనిరూపణ అవసరం ఉండదు. ఒక రోజు ముందు రాజీనామా చేస్తే బల నిరూపణ అవసరం కాగా, 27 మంది కౌన్సిలర్ల క్యాంప్‌లకు వెళ్లి నేరుగా గురువారం మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని చైర్మన్, వైస్‌చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. 36 కౌన్సిల్ స్థానాలు ఉన్న మంచిర్యాలలో 26 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. చైర్మన్‌గా 29వ వార్డు కౌన్సిలర్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్‌గా 2వ వార్డు సల్ల మహేష్ ఎన్నిక లాంఛనమే. అయితే, కలెక్టర్ ఆదేశాలు వచ్చే వరకు ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. గత కౌన్సిల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఐదుగురు కౌన్సిలర్లు బిఆర్ఎస్‌లో చేరారు. ఇప్పుడు బిఆర్ఎస్ నుంచి 17 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరి.. బిఆర్ఎస్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారు.



అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ అనుకోలేదు

అందుకే ఇష్టారీతిన హామీలు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజనులకు రిజర్వేషన్ల పెంపుతో పాటు పోడు పట్టాల పంపిణీ సహా అనేక పథకాలు అందించినప్పటికీ ఆ ప్రాంతాల్లోనూ ప్రజలు తమకు పూర్తి మద్దతు ఇవ్వలేదని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ అన్నారు. ఆ అంశాలపై ఆత్మవిమర్శ చేసుకుని ముందుకు వెళ్తామని తెలిపారు. తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన మహబూబాబాద్ లోక్‌సభ నియోజకర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ అనుకోలేదని.. అందుకే ఇష్టారీతిన హామీలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని నమ్మి గొప్పగా పనిచేసిన నేతలనూ ప్రజలు కూడా తిరస్కరించారని కెటిఆర్ అన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డూ ఇవ్వలేదని ప్రత్యర్థులు విమర్శలు చేశారని.. తొమ్మిదిన్నరేళ్లలో 6,47,479 ఇచ్చినట్లు చెప్పారు. దేశంలో అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు 73 శాతం జీతాలు పెంచిన ఏకైక నాయకుడు కెసిఆర్ అని తెలిపారు. 29 లక్షల పెన్షన్లను 46 లక్షలకు పెంచామని, ఇలాంటి అనేక అంశాలను చెప్పుకోవడంలో విఫలమయ్యామన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల ముందు అభివృద్ధి ఓడిపోయిందని.. పనులు కంటే ప్రచారం మీద ఫోకస్ చేసి ఉంటే గెలిచే వాళ్లమని వ్యాఖ్యానించారు.

వందలాది సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా ఏనాడూ ప్రజలను లైన్‌లో నిలబెట్టలేదన్నారు. వారి సౌకర్యం చూశామే తప్ప రాజకీయ ప్రయోజనం, ప్రచారం గురించి ఆలోచించలేదన్నారు. ప్రజలు తమను పూర్తిగా తిరస్కరించలేదని, బిఆర్ఎస్‌కు మూడో వంతు సీట్లు వచ్చాయని చెప్పారు. స్థానిక సంస్థలు మొదలు అసెంబ్లీ వరకు బలమైన నాయకత్వం ఉందని.. అన్నింటికీ మించి కెసిఆర్ లాంటి గొప్ప నాయకుడు ఉన్నారని చెప్పారు. పార్టీ సమావేశాలను వరుసగా నిర్వహిస్తామని, అనుబంధ సంఘాలను బలోపేతం చేయడంతో పాటు అన్ని వర్గాలను దగ్గరయ్యేలా కార్యక్రమాలు చేపడతామని వివరించారు.

ఎసిబికి చిక్కిన డిఎంహెచ్ఒ జూనియర్ అసిస్టెంట్

- ఫార్మసిస్టు ఉద్యోగానికి రూ.50వేల లంచం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనగామ జిల్లా కేంద్రంలో డిఎంహెచ్ఒ జూనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కారు. ఫార్మసిస్టు నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. పట్టణానికి చెందిన స్రవంతి గతంలో జనగామ మండలం ఓబుల్ కేశపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒప్పంద ప్రాతిపదికన ఫార్మసిస్టుగా పనిచేశారు. అనంతరం రెగ్యులర్ సిబ్బంది వచ్చారని 2023 అక్టోబర్‌లో ఆమెను తొలగించారు. ఈ క్రమంలో రెగ్యులర్ పోస్టు కోసం డిఎంహెచ్ం కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అజ్గర్‌కు స్రవంతి రూ.50 వేలు ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. జిల్లా వైద్యశాఖ అధికారి ప్రశాంత్ సమాచారంతో అధికారులు నిఘాపెట్టారు. ఇద్దరినీ అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు. ఈ దాడుల్లో అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి సాంబయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

రేడియాలజీలో ఉత్తమ పరిశోధనా పత్రం పోటీ

- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ, నిమ్స్ సంయుక్తాధ్వర్యంలో ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ స్థాయి ఉత్తమ పరిశోధనా పత్రం పోటీ 2024ను నిర్వహించనున్నట్టు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. మార్చి పదిన హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్‌లో జరగనున్న పోటీకి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ కాకర్ల సుబ్బారావు ఆశయాలను నిరంతర విద్యా కార్యక్రమంతో ముందుకు తీసుకు వెళ తున్నందుకు సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్‌ను అభినందించారు. ఆ కార్యక్రమాల్లో నిమ్స్ రేడియాలజీ విభాగం భాగస్వామ్యం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సువర్ణ అవకాశాన్ని రేడియోగ్రఫీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఎ వారీస్ కోరారు. కార్యక్రమంలో రేడియాలజీ హెడ్ డాక్టర్ అనుకపూర్, మాజీ డీన్ డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ జ్యోత్స్న రాణి, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అకడమిక్ డైరెక్టర్ దామోదర్ నాయుడు, సిఇఒ శిరందాస్ శ్రీనివాస్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మహేష్ బసవేని తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తి ప్రదాత సరోజినీ దేవి

ప్రజాశక్తి - కల్చరల్

చిన్న నాటనే ఝాన్సి లక్ష్మీ బాయి వంటి మహిళా పోరాట యోధుల జీవితచరిత్రలు తో ప్రేరణ పొంది అనంతరం గాంధీజీ పిలుపు తో దేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న సరోజినీ దేవి నేటి మహిళలకు స్ఫూర్తి ప్రదాత అని అధికార భాషా సంఘం పూర్వ చైర్మన్ మంత్రి శ్రీదేవి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బా రావు కళా వేదిక పై గాన సభ నిర్వహణ లో జరుగుతున్న దశాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా సరోజినీ నాయుడు సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ ఆనాడే కుల రహిత సమాజం కోసం కృషి చేసిన సరోజినీ దేవి తాను ఇతర కులం వారిని వివాహం చేసుకోని ఆదర్శం గా నిలిచారని వివ రించారు. గాంధీజీ ఉప్పు సత్యాగ్రహంలో ముందు వరసలో నిలిచిన సరోజినీ తాను వ్యతిరేకించిన అంశాలను నిర్భయంగా నెహ్రూ వంటి వారితో చర్చించ గల ధీరోదాత్త మహిళ అని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై కథక్ కళా కారుడు అంజిబాబు, కవి చిక్క రామ దాసు , గీతా దేవి పాల్గొన్నారు

జిహెచ్ఎంసికి 'స్వచ్ఛ సర్వేక్షణ్-2023' అవార్డులు

- జాతీయ స్థాయి క్లీన్ సిటీ అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



జిహెచ్ఎంసికి కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల పంట పడింది. స్వచ్ఛ సర్వేక్షణ్-2023 కింద హైదరాబాద్ నగరానికి ఐదు అవార్డులు లభించాయి. లక్ష జనాభా పైబడిన నగరాల్లో ఆల్ ఇండియా క్లీన్ సిటీ 9వ ర్యాంకు సాధించిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ సర్వేక్షణ్- 2023 సంవత్సరానికిగాను ఫైవ్ స్టార్ రేటింగ్‌లో అవార్డు అందుకుంది. దేశంలో 9వ క్లీన్ సిటీ, చెత్త రహిత నగరంగా 5 స్టార్ రేటింగ్, తెలంగాణలో స్వచ్ఛ నగరంగా, తెలంగాణలో మొదటి 5 స్టార్ రేటింగ్ పొందిన నగరం (జనాభా 1 లక్షగా) ధ్రువీకరించారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి చేతుల మీదుగా జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ సోమ భరత్, సానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల గురువారం అవార్డు అందుకున్నారు.

ప్రతి ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

స్వచ్ఛ సర్వేక్షణ్ కింద 2015 నుంచి 2022 వరకు పది లక్షల జనాభా కంటే ఎక్కువ ఉన్న సిటీ జాబితాలో జిహెచ్ఎంసి ర్యాంకింగ్ సాధించింది. ఆ తర్వాత స్వచ్ఛ సర్వేక్షణ్-2018లో గ్రేటర్ హైదరాబాద్‌కు బెస్ట్ స్టేట్ క్యాపిటల్ అవార్డు పొందింది. స్వచ్ఛ సర్వేక్షణ్-2019లో బెస్ట్ మెట్రో సిటీ అవార్డు దక్కింది. ఇదే సంవత్సరంలో ఒడిఎఫ్ం పొందింది. 2019లో జిహెచ్ఎంసి స్వచ్ఛత ఎక్సలెన్సీ అవార్డు పొందింది. స్వచ్ఛ సర్వేక్షణ్-2020లో బెస్ట్ మెగా సిటీ, ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ అవార్డు పొందింది. 2021 సంవత్సరంలో బెస్ట్ సెల్ఫ్ సస్టైనబుల్ మెగా సిటీ అవార్డును పొందడం ద్వారా త్రీస్టార్ హోదాను పొందింది. ఇదే సంవత్సరంలో వాటర్ ప్లస్ సర్టిఫికెట్‌ను మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ అఫైర్స్, హౌసింగ్ ద్వారా పొందింది. 2022లో గార్బేజ్ ఫ్రీ సిటీ కింద త్రీస్టార్ హోదా పొందింది. ఈ సంవత్సరమూ రీ-సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకుంది. జాతీయ స్థాయిలో జీహెచ్ఎంసీకి అవార్డు రావడం మరింత బాధ్యత పెరిగిందని, ఇందుకు విశేష కృషి చేసిన ప్రతి ఒక్కరికీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

తొలిమెట్టు కార్యక్రమాలను రద్దు చేయండి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి డిటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని డీటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంఘం అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి, స్టేట్ అకడమిక్ సెల్ కన్వీనర్ బి రామకృష్ణ కలిసి వినతిపత్రం సమర్పించారు. తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను అమల్లో పెట్టేముందు వాటిని ఎక్కడైనా, ఎప్పుడైనా పరీక్షించి లేదా అనుసరించి అనుకున్న లక్ష్యాలను సాధించారా?అని ప్రశ్నించారు. వాటిని భిన్న ప్రాంతాల్లోని భిన్న నేపథ్యమున్న జిల్లాలకు నాలుగైదు బడుల్లో ఒక టర్మ్ మొత్తం నిర్వహించాలని సూచించారు. ఈ ప్రాజెక్టులో మాడ్యుల్స్ రూపకర్తలు విధిగా ప్రత్యక్ష బోధనలో రెగ్యులర్ ఉపాధ్యాయుల వలె పాల్గొనేలా చూడాలని కోరారు. వాటి అంతిమ ఫలితాల ఆధారంగా తగు నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అప్పటి వరకు తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గుడిసెలపై అధికారుల జులుం

- హనుమకొండలో అర్ధరాత్రి బుల్డోజర్లతో కూల్చివేత
- కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా
- ఇళ్లు, స్థలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి
- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హనుమకొండ జిల్లాలోని గోపాలపురం చెరువుశిఖంలో రెండేళ్లుగా గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలను గత అర్ధరాత్రి (జనవరి 10) ఒంటిగంటకు 500 మంది పోలీసులతో కలిసి అధికారులు చుట్టుముట్టారు. బుల్డోజర్లు, ప్రొక్లైనర్లతో గుడిసెలను కూల్చివేస్తూ పేదలను భయ భ్రాంతులకు గురిచేశారు. విధ్వంసం సృష్టించారు. విషయం తెలుసుకున్న సిపిఎం నేతలు ఘటనా స్థలికి చేరుకునే ప్రయత్నం చేయగా, వారిని అడ్డుకున్నారు. అప్పటికే గుడిసెలను నేలమట్టం చేశారు. దీన్ని నిరసిస్తూ గురువారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ గుడిసెవాసులపై అధికారుల దమనకాండను ప్రతిఒక్కరూ అందరూ ఖండించాలని కోరారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో పక్కా ఇళ్లు ఇవ్వలేదన్నారు. ఇంటి స్థలం లేక వేలాదిమంది పేదలు ఎదురుచూసి.. విసిగిపోయి నగరంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసు కున్నారని చెప్పారు. రెండేళ్ల నుంచి అక్కడే నివాసముంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఆదుకోకపోవడంతో ప్రజలు బిఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని చెప్పారు. ఇండ్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పక్కా ఇళ్లు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీని నమ్మి ఓట్లు వేసి గెలిపించారని అన్నారు. నెల రోజులు తిరగకుండానే గుడిసెవాసులపై దౌర్జన్యం చేయడమేంటని ప్రశ్నించారు. గోపాలపురం చెరువులో 22 ఎకరాల భూమి ఉండగా.. అందులో 12 ఎకరాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు యథేచ్ఛగా అమ్ముకున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం నిలువ నీడలేని పేదలు గుడిసెలు వేసుకొంటే ప్రతాపం చూపడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన వాగ్దానం మేరకు ఇండ్లు లేని పేదలకు స్థలం పట్టాతో పాటు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాన ఉండి పోరాడతామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. అర్ధరాత్రి గుడిసెలను కూలుస్తుంటే అడ్డుకోబోయిన సిపిఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.ఉప్పలయ్య తదితర నాయకులను, గుడిసెవాసులను, మహిళలను ఈడ్చుకెళ్లి అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. అనంతరం సిపిఎం ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. గుడిసెల కూల్చివేతపై కలెక్టర్‌తో చర్చించారు. కలెక్టర్ స్పందించి.. పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు ఎం.చుక్కయ్య, నాయకులు వాంకుడోతు వీరన్న, గొడుగు వెంకట్, జి రాములు, డి తిరుపతి, మంద సంపత్, నోముల కిషోర్, జయశ్రీ, ఒ సాంబయ్య, వల్లెపు రాజు, కె కుమార్, అశోక్, యాకయ్య, వెంకటయ్య, లింగమూర్తి, మల్లయ్య, కొమురెల్లి, ఎం రమ, ఉమ, జగన్ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

ధరణి ప్రక్షాళన షురూ!

- సచివాలయంలో కమిటీ తొలి భేటీ
- సమస్యల శాశ్వత పరిష్కారంపై ఫోకస్
- సమాచార సేకరణ తర్వాత నివేదిక
- పెండింగ్‌లో 2.31 లక్షల దరఖాస్తులు
- 130 రకాలకుపైగా రెవెన్యూ సమస్యలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధరణితో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వ్యవస్థలోని లోటుపాట్లను సవరిస్తూ, భూ సమస్యలకు తక్షణ, శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల నిపుణుల కమిటీ తొలి సమావేశం గురువారం సచివాలయంలో జరిగింది. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఎ) మెంబర్ కమిషనర్ నవీన్ మిట్టల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం కోదండరెడ్డి, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రేమండ్ పీటర్, ప్రముఖ న్యాయవాది సునిల్, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్‌లతో కూడిన కమిటీ ధరణి అమలవుతున్న తీరు, విధి విధానాలను అధికారులను అడిగి తెలుసుకుంది. ఎ మాడ్యూల్‌లో ఎన్ని దరఖాస్తులొచ్చాయని ఆరా తీసింది. కోర్టు పరిధిలో ఉన్న భూములు, పిఒబి జాబితాలో ఉన్న భూముల వివరాలను గ్రామం, మండలాల వారీగా సేకరించనున్నారు. ధరణికి ముందు, తరువాత ఉన్న అసైన్డ్ భూమి, భూదాన్, ఎండోమెంట్, వక్ఫ్ భూములు, పిఒబి, ప్రభుత్వ భూములు, వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలపై సమావేశంలో చర్చించారు.

పెండింగ్‌లో 2.31 లక్షలు దరఖాస్తులు

రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం ధరణి పోర్టల్‌లో పస్తుతం 1 నుంచి 33 వరకు టెక్నికల్ మ్యాడ్యూల్స్ (టిఎం) ఉన్నాయి. ఈ మాడ్యూళ్లలో పరిష్కారం కోసం చేసుకున్న 2.31 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 1.8 లక్షల ఎకరాల భూములకు సంబంధించి డిజిటల్ సంతకాల (డిఎస్) కోసం భూ యాజమానులు ఎదురు చూస్తున్నారు. ధరణి పోర్టల్ అమల్లోకి రాకముందు 75 రకాల భూ సమస్యలుంటే, ధరణి వచ్చాక ఆ సమస్యల సంఖ్య 130కి పెరిగాయనే విమర్శలున్నాయి. సాదా బైనామా కోసం 9.5 లక్షల దరఖాస్తులు రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు ధరణి పోర్టల్‌లో ప్రస్తుతం అవకాశం లేదు. అమల్లోకి తెచ్చిన ఆర్వోఆర్-2020 చట్టంలో చిన్నపాటి సవరణ చేస్తే సాదాబైనామా కోసం నిరీక్షిస్తున్న లక్షలాది మందికి ఊరట లభిస్తుంది.

ధరణి వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోయారు
కమిటీ సభ్యులు ఎం కోదండరెడ్డి

గత ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్ వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోయారని కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి విమర్శించారు. గురువారం సచివాలయంలో కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ధరణి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిందని, ఆ క్రమంలోనే అధికారం చేపట్టిన వెంటనే సిఎం రేవంత్ రెడ్డి సమస్యలపై దష్టి సారించారని తెలిపారు. కేంద్రం భూసర్వే కోసం రూ.83 కోట్లు మంజూరు చేసినా రాష్ట్ర సర్కార్ ఎలాంటి సర్వే చేపట్టలేదని అన్నారు. పక్కనున్న ఏపీ సైతం భూసర్వే, డిజిటలైజేషన్, టైటిల్ గ్యారంటీలను చేపట్టిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు.

కమిటీ కోసం సిసిఎల్ఎలో కార్యాలయం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రెండో సమావేశం ఈ నెల 17న జరగనుందని చెప్పారు.



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమ
- సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలి(హైదరాబాద్) ఆధ్వర్యంలో ముగ్గులు, మ్యూజికల్ చైర్ ఆటల పోటీలు నిర్వహించారు. పి.మంజుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమ మాట్లాడారు. మహిళలు ప్రతి రంగంలోనూ రాణించాలని సూచించారు. మహిళ అంటే ఆదిశక్తి అని, వంటింటి కుందేలుగా ఉండొద్దని అన్నారు. పేద, మధ్యతరగతి, ధనిక అని తేడా లేకుండా అందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంస్కృతి గొప్పతనమన్నారు. సాంఘిక కార్యకర్త ఎ.రాణి మాట్లాడుతూ.. ఎస్‌వికె ఇలాంటి కార్యక్రమం నిర్వహిచడం.. మహిళలను ప్రోత్సహిచడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు ఎం.సుజాత, 80 మంది మహిళలు పాల్గొన్నారు.



జానపద పాటల అసమాన గాయని అనసూయ

- సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి - కల్చరల్

జాన పద గీతాలను ఆకాశవాణి లో తన గళంలో పరవళ్ళు తొక్కించిన అసమాన గాయని అనసూయా దేవి అని ప్రముఖ సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు.రవీంద్ర భారతి లోని పైడి జైరాజ్ మినీ ఆడిటోరియం లో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దీపాంజలి సంస్థ నిర్వాహణలో సీతారత్నకర్ రూపకల్పన చేసిన అసమాన అనసూయ డాక్యుమెంటరీ ని ప్రదర్శించారు ఈ సందర్భం గా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అశోక్ తేజ పాల్గొని అనసూయ జనపద సాహిత్య ప్రచారం కోసం చేసిన కృషిని కొనియాడారు.సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ మాట్లాడుతూ విఖ్యాత గీత కర్త దేవులపల్లి కృష్ణ శాస్త్రి కి మేనకోడలు కాగా అనసూయ అయన లలిత గీతలు మధురం గా గానం చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గాయని వేదవతి ప్రభాకర్ నుసీతా రత్నాకర్ ను ప్రముఖ నాట్య గురువు రత్న పాపను అతిథులు సత్కరించారు వేదిక పై సాహితీవేత్త వోలేటి పార్వతీశం, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ ను రచయిత్రి ఇనంపుడి శ్రీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు సంస్థ స్థాపకురాలు డాక్టర్ దీపికా రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు.